క్లుప్తంగా

ఉద్యోగాలకు 29 మంది ఎంపిక



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 90 మంది హాజరు కాగా 29 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి తెలిపారు. అరబిందో ఫార్మా, హెసర్, న్యూలాండ్, ఎమెస్స్ ఐటీ సొల్యూషన్ కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాలో 29 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఉమారాణితో పాటు జేకేసీ కోఆర్డినేటర్ వర్ల అరుణకుమారి పర్యవేక్షించారు.

29న శ్రీఅన్నపూర్ణాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో గత ఏడాది నిర్మించిన శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి సోమవారం చెప్పారు. దుర్భా హరిబాబుస్వామి పర్యవేక్షణలో ఉదయం 7గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవతామూర్తులకు నూతన వస్త్రాలంకరణ పూజలు, 9గంటలకు దేవతామూర్తులకు మహా సంప్రోక్షణ, శాంతి హోమం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల మహా శాంతి కల్యాణం,7గంట లకు అన్నసంతర్పణ జరుగుతాయని వివరించారు.

బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ విక్రయించొద్దు



మోపిదేవి: జూన్ 6వ తేదీ వరకు ఫిల్లింగ్ స్టేషన్స్‌లో పెట్రోలు, డీజిల్ లూజ్‌గా బాటిల్స్, టిన్స్ వంటి వాటిలో విక్రయించడానికి వీలులేదని తహసీల్దార్ శ్రీవిద్య బంక్ యజమానులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బంక్ యజమానులు, బాణ సంచా విక్రయ దారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ ప్రక్రియలో ఆందోళలను అరికట్టి, శాంతి భద్రతలను కాపాడేందుకు ఫిల్లింగ్ స్టేషన్‌లో లూజ్ పెట్రోలు, డీజిల్ అమ్మకాలు, అన్ని ఫైర్ క్రాకర్స్ షాపులపై తాత్కాలిక నిషేధం విధించినట్లు వివరించారు. బంక్ ప్రతినిధులు, క్రాకర్స్ షాపుల యజమానులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

పెడన: దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పెడనలో మంగళవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. పెడన, గూడూరు, బంటుమిల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు లింగాల సుధాకర్, డాక్టర్ సీహెచ్‌వీ అప్పారావు, చిత్రాల రమేష్‌బాబు, కట్టా నాగేశ్వరరావు, ఎండీ ఫిరోజ్‌బేగ్, రాగి రమేష్, ఎండీ జమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో స్వామి



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారు పెండ్లి కుమారుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకారం చేశారు. ఆలయ ధర్మకర్త పోతురాజు షణ్ముక వెంకటాచలం దంపతులు స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం నరసింహ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతురాజు భాస్కరరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆరో రోజూ ఈఏపీసెట్ పరీక్ష

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈఏపీసెట్ ఇంజినీరింగ్ స్ట్రీమింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈఏపీసెట్ పరీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికి గాను 182 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 193 మందికి 185 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

మొక్కల ప్రేమికుడు.. సేవాతత్పరుడు

- జీజీహెచ్‌లో పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి
- వాటర్ ప్లాంట్ ఏర్పాటు, మొక్కల పెంపకానికి కృషి
- ఉద్యోగుల ఆర్థిక భరోసాకు సహకార సొసైటీ ఏర్పాటుకు కృషి
- ఉన్నతాధికారులతో ప్రశంసలు, అవార్డులు



ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని (ఫైల్)

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రిలో పచ్చదనం పరిమళించేందుకు కృషి చేస్తున్నాడు ఓ చిరుద్యోగి. ఆసుపత్రి ఆవరణలో గ్రీనరీని ఏర్పాటు చేసేందుకు 25 ఏళ్లుగా లక్షలాది రూపాయలు సొంత సొమ్మును ఖర్చు చేస్తూ కృషి చేస్తున్నాడు. ఆయన ఏర్పాటు చేసిన పలు మొక్కలు చెట్లుగా మారి ఫలసాయాన్ని అందిస్తున్నాయి. మొక్కల పెంపకంతో సరిపెట్టకుండా ఆసుపత్రిలో అవసరమైన పలు సేవా కార్యక్రమాలను ఆయన ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందుతున్నాడు. మొక్కల ప్రేమికుడిగా, సేవాతత్పరుడిగా జీజీహెచ్‌లో పేరొందిన అతనే పల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి. ఆసుపత్రిలో ప్లంబర్‌గా పనిచేస్తున్న ఆయన తన తండ్రి మైలవరం మండలం వెల్వడం జెడ్పీహెచ్ స్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం పల్లపరెడ్డి వెంకటనర్సిరెడ్డి, తల్లి వరలక్ష్మి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. 1998 నుంచి ఆసుపత్రిలో తనవంతు సేవా కార్యక్రమాలు ప్రారంభించిన ఆయన అప్పట్లో ఉద్యోగుల ఆర్థిక భరోసా కోసం కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటుకు కృషి చేశారు.

మొక్కల పెంపకం..

13 విడతలుగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు గ్రీనరీ ఏర్పాటుకు కృషి చేశారు. ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీనరీ ఆసుపత్రికి వచ్చే వారికి ఆహ్లాదాన్ని పంచటంతో పాటు మొక్కలు పెద్దవై ఫలసాయాన్ని అందిస్తున్నాయి. మొక్కలు నాటే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేర్ని నానితో పాటు ఆయన తనయుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్లు, వైద్యులు పాల్గొన్నారు. ఆసుపత్రి ఆవరణలో వైద్యులు, ఉద్యోగుల ఆటవిడుపునకు గానూ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు బ్యాడ్మింటన్ ఆడుకునే అవకాశం కల్పించారు. ఇలా పలు సేవా కార్యక్రమాలు, మొక్కల పెంపకం చేస్తున్న శ్రీనివాసరెడ్డి సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు పలుమార్లు ఆయనకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

సేవా కార్యక్రమాలు ఇవీ..

ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులకు, ఉద్యోగులకు తాగునీరు అందించేందుకు ఆసుపత్రి ఆవరణలో రెండు తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేయించారు. కరోనా సమయంలో రోగులకు అవసరమైన దిండ్లు, ఆక్సిజన్ సిలిండర్లను తరలించే స్టాండ్లను అప్పటి కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్, ఎమ్మెల్యే పేర్ని నాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన స్ట్రెచర్లు, వీల్ చైర్లను పలుమార్లు అందజేశారు. దాదాపు రూ.3 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం ఆసుపత్రిలో రోగులు వారి సహాయకుల కోసం తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను ఎమ్మెల్యే పేర్ని నాని, అప్పటి మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు.



ఆసుపత్రి ఆవరణలో శ్రీనివాసరెడ్డి సహకారంతో పెంచిన చెట్లు



మెడికల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ విజయకుమారికి మొక్కలు అందజేస్తున్న పేర్ని కిట్టు, శ్రీనివాసరెడ్డి

శ్రీకాకుళేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ఏసీ చక్రధరరావు



శ్రీకాకుళేశ్వరస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళంలో శ్రీరాజ్యలక్ష్మీ భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వర (ఆంధ్ర మహావిష్ణు) స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీకాకుళేశ్వర స్వామి వారిని పెండ్లి కుమారుని చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు స్వామి వార్లకు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం 6గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై పెండ్లి కుమారుడైన స్వామి వార్లను గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనపూజ, అంకురారోహణ, ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణతో మొదటిరోజు కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ ఏసీ చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి 8గంటలకు శ్రీకాకుళేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలియజేశారు.

రాయితీపై పచ్చిరొట్ట పైరు విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏవో శ్రీనివాసరావు, ఎంపీఈవో కీర్తి

పెడన: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట పైరు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పెడన వ్యవసాయశాఖ అధికారి జీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బల్లిపర్రు రైతు భరోసా కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట పైరు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైరు విత్తనాలు జీలుగ, పిల్లిపెసర, జనుము ఈ మూడింటిలో ఏదైనా ఒకదానిని పంట పొలాల్లో చల్లి పూత దశలోనే ఆ మొక్కలను భూమిలో కలియ దున్నాలని సూచించారు. ఈ విధంగా దున్నడం వల్ల భూమిలోని భౌతిక, రసాయనిక పరిస్థితులు మెరుగుపడి సేంద్రియ కర్బన శాతం వృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయంలో చీడ పురుగుల బెడద ఉధృతి తగ్గి లాభసాటి సాగు వస్తుందని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట పైరు విత్తనాలతో బహుళ ప్రయోజనాలు పొంది అధిక లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో రైతులకు పచ్చిరొట్టపైరు విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తోందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీఈవో కీర్తి, రైతులు పాల్గొన్నారు.

మోపిదేవి: రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తునట్లు మండల వ్యవసాయాధికారి హెబ్సిబారాణి మంగళవారం తెలిపారు. మోపిదేవి ఆర్‌బీకే వద్ద పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ 151 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 26 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు, 25 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డుతో రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. వీఆర్వో రమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.



మోపిదేవిలో పచ్చరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో హెబ్సిబారాణి

అలరించిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్య రీతులను ప్రదర్శించి అలరించిన అర్చన బాలికల బృందం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో సోమవారం రాత్రి అవనిగడ్డకు చెందిన అర్చన నృత్యాలయం బాలికలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. మంగళవారం ఆలయంలో ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు, జగజ్యోతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, కండూరి శ్రీనివాసాచార్యులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు, భోగాది లోకేశ్వరరావు, భోగాది అప్పారాయుడు జంటలు పీటలపై కూర్చుని పూజాధికములు జరిపారు. బుధవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం, కల్యాణ మహోత్సవం జరుగుతాయని ధర్మకర్త చెప్పారు.

ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు 144 సెక్షన్ అమలు

ఎస్ఐ సూర్యశ్రీనివాస్



పెడన: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంతో పాటు మండలంలో కూడా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పెడన ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎన్నికల అనంతరం చెలరేగే హింసను అరికట్టేందుకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు. జిల్లా ఎస్పీ నయీమ్ అస్మీ ఆదేశాల మేరకు మండలంలో కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జరిగేందుకు సహరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు కూడా సెక్షన్ 144 అమల్లో ఉటుందన్నారు. ఏ ప్రాంతంలోనూ నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపుగా ఉండరాదన్నారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూదన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులను పోస్టు చేసి ప్రచారం చేయడం నేరమని, ఇటువంటి వారిపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా కాల్చడం, ఇతర పార్టీ అభ్యర్థులు కార్యకర్తల ఇంటి ముందు కవ్వించేలా బాణసంచా కాల్చి రెచ్చగొట్టడం వంటివి చేయరాదని, అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

కేవీకే ప్రోగామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత



విద్యార్థినులతో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు

ఘంటసాల: వ్యవసాయంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బాపట్లలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవం (రావేప్) కార్యక్రమంలో భాగంగా స్థానిక జలధీశ్వరస్వామి ఆలయం ముందు మంగళవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత, వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం విద్యార్థినులు గ్రామస్థాయిలో సాంఘిక, ఆర్థిక విషయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నవీన్, మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ, బాపట్ల వ్యవసాయ కళాశాల అధ్యాపకులు అపర్ణ, విజయ్ కుమార్, జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం జె.రామ్మోహనరావు, రైతులు, గ్రామస్తులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ మాతకు మహా పుష్పాభిషేకం



వాసవీ మాతకు పువ్వులను తీసుకువచ్చిన మహిళా మండలి సభ్యులు, భక్తులు

పెడన: పట్టణంలో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి మంగళవారం మహాపుష్పాభిషేకాన్ని నిర్వహించారు. గత మూడు రోజులుగా శ్రీవాసవీ మాత జయంతి మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి ముగించగా మంగళవారం సంప్రదాయకంగా అమ్మవారికి మహాపుష్పాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం వాసవీ క్షేత్రంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్న, సభ్యుల పర్యవేక్షణలో పట్టణ శ్రీవాసవీ మహిళా మండలి వారు గులాబీలు, చామంతులు, మల్లెలు, కాగడా మల్లెలు, బ్లూ, పసుపు చామంతులు తదితర 108 కిలోల పూలతో శ్రీవాసవీ మాతకు పుష్పాభిషేకం (పుష్పయాగం) పూజా కార్యక్రమాన్ని 125 మంది మహిళా భక్తులు, పట్టణ శ్రీ వాసవీ మహిళా మండలి కార్యవర్గ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవాసవీ క్షేత్రం నిర్మాణం జరిగిన 50 సంవత్సరాలలో తొలిసారిగా మహా పుష్పాభిషేకం నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా పట్టణ శ్రీవాసవీ మహిళా మండలి వారు ఆలపించిన భక్తి పాటలు ఆకట్టుకున్నాయి.

ఉపాధి పనుల్లో అవకతవకలను ఉపేక్షించం



పెడన: ఉపాధి హామీ పథకం పనుల్లో అవక తవకలను ఉపేక్షించమని ఆ శాఖ అంబుడ్స్ పర్సన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెడన మండలంలో వివిధ గ్రామాల్లో పథకం అమలుతీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అమల్లో వేతనదారులు ఎటువంటి నష్టానికి గురి కాకూడదన్నారు. పథకం అమలులో మిషనరీని ఉపయోగించరాదని, గురివిందగుంటలో ప్రొక్లయిన్‌తో చేపట్టిన పని స్థానిక రైతులు తమ అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నదే కానీ ఎన్ఆర్ఈజీఎస్‌కు ఎటువంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.

పరిశుద్ధ అగ్ని సువార్త సభలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: మెస్సీయ హోలీఫైర్ మినిస్ట్రీస్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డు రింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రీస్తు పరిశుద్ధ అగ్ని సువార్త స్వస్థత మహోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మినిస్ట్రీస్ నిర్వాహకుడు బ్రదర్ మధు విక్టర్‌పాల్ వాక్యోపదేశం చేశారు. బైబిల్ లోని పలు ఆధ్యాయాల నుంచి వాక్యాలను క్రైస్తవులకు వివరించారు. ప్రభువైన ఏసుక్రీస్తుపై విశ్వాసం ఉంచి ప్రార్థన చేస్తే ఎలాంటి అస్వస్థతనైనా ఆయన నయం చేస్తాడని వివరించారు. విశ్వాసంతో చేసే ప్రార్థన మానవజీవితానికి ఎంతో దీవెనకరంగా ఉంటుందన్నారు. బుధ, గురు వారాల్లో కూడా సాయంత్రం ఈ స్వస్థత మహోత్సవాలు నిర్వహిస్తామని కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రెడ్డి పాల్ వాక్యోపదేశం చేస్తారని మధువిక్టర్‌పాల్ తెలిపారు. తొలుత గాయనీగాయకులు ఆలపించిన పలు క్రైస్తవ గీతాలు సభలకు హాజరైన క్రైస్తవులను ఆకట్టుకున్నాయి.

నేడు అన్నసమారాధన

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పెద్దకరగ్రహారం గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా నటేష్ మంగళవారం తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దకరగ్రహారంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మూడో రోజుకు చేరిన మాధవస్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం ఆలయంలో నిత్యహోమం, బలిహరణ నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమం, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి జగజ్యోతి పూజా కార్యక్రమాలు జరిపించిన అనంతరం స్వామి వారిని శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల్లోకి వచ్చిన స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పనస తొనలతో పూజలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి 1008 పనస తొనలతో పూజలు చేశారు. మంగళవారం ప్రసన్నాంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు కావటంతో స్వామివారికి గారెల దండ వేసి 1008 పనస తొనలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



సాంబయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాము

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త మాదాసు సాంబశివరావు(సాంబయ్య 53) మంగళవారం వేకువజామున గుండెపోటుతో మరణించాడు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తగా సేవలందించిన సాంబయ్య ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో పాల్గొని అభ్యర్థి రాము గెలుపు కోసం అవిరళ కృషి చేశారు. పినతల్లి మాదాసు లక్ష్మీశకుంతల పెందుర్రు ఎంపీటీసీగా గెలుపు కోసం సాంబయ్య పనిచేశారు. పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) సాంబయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతికి కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వి.చినబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి.శ్రీనివాసరావు, ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ పి.మహేష్, సర్పంచ్ బి. చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, ఎం. నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.నాగబాబు, గ్రామ పార్టీ కన్వీనరు ఎం.నాని, ఎం.నాగేశ్వరరావు, సీహెచ్.మాణిక్యం, డైరెక్టర్ ఎం.నాంచారమ్మ తదితరులు సాంబయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ధ్రువ పత్రాలు లేని 13 బైక్‌లు స్వాధీనం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు త్రినాథ్, నాగప్రసాద్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 5గంటలకే ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత లంకమ్మ మాన్యం ఎంట్రన్స్‌లో 50 మందికి పైగా పోలీసులు చేరి బృందాలుగా వెళ్లి ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. నిద్ర లేవకముందే తమ ఇళ్ల వద్ద పోలీసులను చూసిన కొంతమంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ షీటర్ల ఇళ్లను నిశితంగా పరిశీలించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినా, ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎవరన్నా అల్లర్లకు పాల్పడే అవకాశాలు ఉన్నా వెంటనే సమాచారం అందించాలని అవనిగడ్డ సీఐ త్రినాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎస్ఐ రమేష్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘంటసాల: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఘంటసాల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగం పెరగడంతో దానికి అనుగుణంగా విద్యుత్ సబ్ స్టేషన్ సామర్థ్యం పెంచేందుకు నూతనంగా రెండు విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ పనుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని ఘంటసాల, దేవరకోట, మల్లంపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం, ఘంటసాలపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఏఈ రవికుమార్ కోరారు.

పబ్లిక్ నోటీసు